క్లుప్తంగా

అందరి కృషితోనే జీవవైవిధ్యం



విద్యార్థులకు పిచ్చుక గూళ్లు, ఆహారం ఆవశ్యకతను వివరిస్తున్న ఎర్రునాయుడు

కె.కోటపాడు : ప్రస్తుత కాలంలో టవర్‌ల నిర్మాణం, చెట్ల నరికివేతతో పిచ్చుకల మనుగడ ప్రమాదంలోపడి, వాటి సంఖ్య తగ్గే పరిస్థితులు ఉన్నట్లు కె.కోటపాడు హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు బి.ఎర్రునాయుడు అన్నారు. హైస్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులకు పిచ్చుకల ప్రాముఖ్యతను వివరించారు. జీవవైవిధ్యాన్ని పెంచే క్రమంలో పిచ్చుకల అభివృద్ధికి అంతా సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు పిచ్చుకలకు గూళ్లు, వాటికి ఆహారం అందించడం కనీస బాధ్యతగా గుర్తించి, పిచ్చుకలు అంతరించిపోకుండా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యనారాయణమూర్తి, పీఈటీ జ్యోతి పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయి పనులు ప్రారంభం



కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రఘురాం

గొలుగొండ : నాగాపురం గ్రామ పంచాయతీలో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులకు సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేసి, ప్రారంభించారు. ఈ పంచాయతీలో ప్రతీ ఇంటికి తాగునీరందించేందుకు జల్ జీవన్ మిషన్ పథకంలో రూ.33 లక్షలు మంజూరయ్యాయి. దీంతో త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

పోలీసుల తీరును నిరసిస్తూ న్యాయవాదుల ధర్నా



కోర్టు మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

నర్సీపట్నం : విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆత్మూరి వెంకట భగవాన్‌పై పోలీసులు పెట్టిన తప్పుడు కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి లోకా లోవరాజు డిమాండ్ చేశారు. అక్రమ కేసును నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం కోర్టు మెయిన్ గేటు వద్ద ధర్నా చేశారు. న్యాయవాది తన కుటుంబానికి జరిగిన అన్యాయంపై పోలీసులను ఆశ్రయిస్తే తిరిగి పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనల వల్ల పోలీసు వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. ఈ ధర్నాలో సీనియర్ న్యాయవాదులు పొక్కునూరి నరసింహ, చింతల ప్రకాష్, కె.ఆర్.వి.సత్యనారాయణ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వి.సంతపాలెంలో ఫ్యామిలీ ఫిజిషియన్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి శైలజ

కె.కోటపాడు : ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా నెలలో ఒక రోజు గ్రామాలకు వెళ్లి, వ్యాధి బాధితులకు వైద్యం అందిస్తున్నట్టు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శైలజ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను అందించారు. 139 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఇచ్చారు. ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందే స్థితిలో లేక, ఇంటి వద్దనే పరిమితమైన 19 మంది ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, జాగ్రత్తలను వివరించారు.

నూకాలమ్మ జాతరకు వేళాయె



మర్రిపాలెంలో గరగలు ఊరేగిస్తున్న భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న సన్యాసిపాత్రుడు



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నర్సీపట్నం రూరల్ సీఐ, నాతవరం ఎస్‌ఐ

నర్సీపట్నం : కొత్త అమావాస్య సందర్భంగా స్థానిక నూకాంబిక అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను, కమిటీని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు కోరారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అమ్మవారి జాతరను విజయవంతం చేసేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కర్రి రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి గుర్రం, ఎడ్ల పరుగు పోటీలు

బుచ్చెయ్యపేట : స్థానిక పల్లెల్లో నూకాలమ్మ పండగకు ప్రజలు పటిష్ట ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రం బుచ్చెయ్యపేట, మేజర్ పంచాయతీ వడ్డాది, కేపీ అగ్రహారం, ఆర్.భీమవరం, తురకలపూడి, పెదపూడి, విజయరామరాజుపేట, కొమ్మళ్లపూడి, రాజాం, సీతయ్యపేట తదితర గ్రామాల్లో నూకాల తల్లి ఆలయాలను భారీ విద్యుత్ లైట్ల సెట్టింగ్‌లతో అలంకరించారు. మంగళవారం అమ్మవారి సంబరం సందర్భంగా ఆర్.భీమవరంలో జిల్లా స్థాయి గుర్రం పరుగు పందేలు, కేపీ అగ్రహారంలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలను ఏర్పాటు చేశారు. గెలిపొందిన విజేతలకు నాయకులు, ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో బహుమతులను అందించనున్నారు. రాత్రికి ఆయా గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భారీ బాణసంచా వెలుగుల మధ్య అమ్మవారి సంబరం జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

రోలుగుంట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన రోలుగుంట నూకాలమ్మ పండగకు నిర్వాహకులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మున్సిబ్ కుటుంబీకులతో కలసి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్, మడ్డు గైరమ్మ సత్యం సోమవారం ఆలయ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి, ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మడ్డు చిట్టిబాబు మాట్లాడుతూ పండగ సంప్రదాయం మేరకు సోమవారం ఘటాలతో ఊరేగింపు, భక్తుల జాగారం ఉంటుందన్నారు. మంగళవారం వేకువజాము నుంచి తరలివచ్చే భక్తులకు అమ్మవారిని దర్శించుకునే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

నాతవరం: మండలంలోని బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య తెలిపారు. సోమవారం ఆయన నాతవరం ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణతో కలిసి నూకాలమ్మ ఆలయ ప్రాంగణాన్ని స్వయంగా పరిశీలించారు. కొత్తఅమావాస్య పండగ సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి రానుండటంతో ముందస్తు చర్యలు చేపట్టారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులకు ప్రత్యేకంగా ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ పూర్వం నుంచి ఎలా జరుగుతుందో.. అలానే ఈ ఏడాది కూడా నూకాలమ్మ తల్లి పండగ సంప్రదాయబద్ధంగా జరిగేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఉత్సవ కమిటీ సభ్యుల సహకారం తీసుకుంటామన్నారు.

జిల్లాస్థాయి కోలాటం, ఎడ్ల బళ్ల పోటీలు

దేవరాపల్లి : నూకాంబిక అమ్మవారి జాతర పురస్కరించుకుని మామిడిపల్లిలో మంగళవారం జిల్లా స్థాయి మహిళల కోలాట ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ కర్రి సూరినాయుడు సోమవారం తెలిపారు. విజేతలకు నగదు బహుమతులను అందిస్తామన్నారు. నూకాంబిక అమ్మవారి జాతర, ఉగాది వేడుకల్లో భాగంగా ఎ.కొత్తపల్లిలో మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ తెలిపారు. సోమవారం ప్రారంభమైన వేడుకలు బుధవారంతో ముగుస్తాయన్నారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 22న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందించనున్నట్టు సర్పంచ్ తెలిపారు.

ఘనంగా గరగల ఊరేగింపు

నాతవరం : మండలంలో కొత్త అమావాస్య పండగ సందర్భంగా పలు గ్రామాల్లో వెలసిన నూకాలమ్మ తల్లి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. దేవదాయశాఖ ధర్మదాయ శాఖ అధ్వర్యంలో మర్రిపాలెం, నాతవరం గ్రామాల్లో ఉన్న నూకాలమ్మ తల్లి పండగకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి పండగ సందర్భంగా సోమవారం గరగల సంబరాలు నిర్వహించారు. అమ్మవారి పూజారి యాదగిరి అర్జున్ అధ్వర్యంలో మర్రిపాలెం, వెన్నలపాలెం, కొత్త ఎల్లవరం, బాపన్నపేట వీధుల్లో గరగలు ఊరేగించి, రాత్రి జాగారం నిర్వహించారు. బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో రాత్రి సినీ ఆర్టిస్టులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ మందుగుండు సామాగ్రిని వెలిగించి, సంబరాలు చేశారు.

భవన నిర్మాణాల్లో లోపాలుంటే చర్యలు



పీహెచ్‌సీలో అదనపు భవనాన్ని పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రకాశరావు

నాతవరం : నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోల్ అధికారి కె.ప్రకాశరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రూ.కోటీ 65 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని సోమవారం తనిఖీ చేశారు. గదులతో పాటు శ్లాబు తదితర పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొత్తగా చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా నాతవరం పీహెచ్‌సీలో నిర్మించిన కొత్త భవనాన్ని పరిశీలించామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన మెటీరియల్‌తో కట్టిన భవనాలకు ఎలాంటి సమస్య ఉండదన్నారు. కొందరు నాణ్యతా ప్రమాణాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, అలాంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ కె.ప్రభు, జేఈ జయరాజ్, కాంట్రాక్టర్ పి.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్ పట్ల అప్రమత్తం



మాడుగుల బస్టాండ్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మాడుగుల : నోటి క్యాన్సర్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. ప్రపంచ నోటి శుభ్రత దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. మాడుగుల సీహెచ్‌సీలో దంత వైద్యసేవలు అందుబాటులో ఉన్నట్టు వైద్యాధికారి సునీత తెలిపారు. ఈ ర్యాలీలో జనరల్ మెడిసిన్ వైద్యుడు సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ తాతబాబుపై స్పందనలో ఫిర్యాదు

రావికమతం : గ్రామంలో అమ్మతల్లి పండగ నిమిత్తం విద్యుత్ వాడుకునేందుకు రూ.1,500 మామూళ్లు తీసుకున్న రావికమతం లైన్ ఇన్‌స్పెక్టర్ తాతబాబుపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకన్నబాబుకు, ట్రాన్స్‌కో ఏఈ నందన్‌కు గొల్లలపాలెం గ్రామ రైతు కరణం సత్తిబాబు సోమవారం ఫిర్యాదు చేశాడు. తమ గ్రామంలో మరిడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా విద్యుత్ ఉపయోగిస్తున్నందుకు ప్రభుత్వానికి రూ.4 వేలు కట్టాలని ఈ నెల 16న తాతబాబు తమను ఇబ్బంది పెట్టినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంత మొత్తం తమ వద్ద లేవని చెప్పగా డీడీ పేరిట రూ.1,500 తీసుకుని, ఇప్పటికీ రశీదు ఇవ్వలేదని తెలిపారు. రశీదు గురించి అడిగితే ఆ మొత్తం తనకివ్వాల్సిన మామూళ్లని చెప్పినట్టు సత్తిబాబు తన ఫిర్యాదులో ఆరోపించారు. ప్రభుత్వానికి చెందాల్సిన మొత్తాన్ని మామూళ్ల పేరిట జేబులో వేసుకున్న తాతాబాబుపై చర్యలు తీసుకోవాల్సిందిగా సత్తిబాబు ఫిర్యాదులో కోరాడు.

కమీషన్ పెంచాలంటూ హమాలీల నిరసన

రావికమతం : ప్రభుత్వం ఇచ్చే కమీషన్‌ను పెంచాలంటూ స్థానిక పౌర సరఫరాల గోదాంలో పనిచేసే హమాలీలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ 15 మంది హమాలీలు పనిచేస్తున్నారు. వీరికి టన్నుకు రూ.19 చొప్పున ప్రభుత్వం కమీషన్ చెల్లిస్తుంది. అయితే నిత్యావసరాల ధరలు పెరగడంతో తమకు కూలి గిట్టుబాటు కావట్లేదని, ఆ మొత్తాన్ని రూ.25 పెంచాలని కోరుతూ ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు తాటికొండ సత్యారావు, పెంటకోట సత్యారావు, ఉగ్గిన కృష్ణమూర్తి, కొశిరెడ్డి రాజు, గూడెం సత్తిబాబు, గంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

23న ఆలయ భూముల వేలం

బుచ్చెయ్యపేట : మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాది రామలింగేశ్వరస్వామి ఆలయ భూముల కౌలుకు ఈ నెల 23న వేలం పాట నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో శర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వడ్డాది సర్వే నెం.28–2లో 1.20 ఎకరాలు, విజయరామరాజుపేట సర్వే నెం.139–4లో 4.50 ఎకరాలు, అదే గ్రామంలోని సర్వే నెం.4–25లోని 0.50 ఎకరాల భూములకు గురువారం ఉదయం 11 గంటల నుంచి ఆలయం వద్ద వేలం పాట జరుగుతుందన్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2026 మార్చి నెలాఖరు వరకు మూడు సంవత్సరాల పాటు దేవుడి భూమిని సేద్యం చేసుకుని, కౌలు విధానంలో ఫలసాయం పొందవచ్చన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా ఒక్కో నెంబర్ భూములకు రూ.5 వేలు చొప్పున ప్రథమ ధరావతు చెల్లించాల్సి ఉందన్నారు. వేలంపాటలో దక్కించుకున్నవారు తొలి ఏడాది శిస్తు మొత్తాన్ని ముందుగానే దేవస్థానానికి చెల్లించాలని స్పష్టం చేశారు.

వాహనాల్లో నగదు చోరీల పట్ల అప్రమత్తం

దేవరాపల్లి : స్కూటీ, కారు తదితర వాహనాల డిక్కీలలో నగదు దొంగతనాల పట్ల ప్రజలు, వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని దేవరాపల్లి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ బి.రామకృష్ణ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఈ తరహా దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కొత్తవలసలో సోమవారం స్కూటీలో ఉంచిన రూ.6 లక్షలు, రెండు రోజుల క్రితం సామర్లకోటలో రూ.8లక్షలు, రెండు వారాల క్రితం దేవరాపల్లిలో రూ.లక్ష నగదు చోరీకి గురైన విషయాన్ని వెల్లడించారు. స్కూటీలలో నగదు పెట్టే ముందు పరిసరాలను గమనించుకోవాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనబడితే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

వినికిడి యంత్రం అందజేత

కొయ్యూరు: నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె. శివప్రసాద్ సోమవారం గొలుగొండ మండలం ఏఎల్ పురానికి చెందిన తంగేటి సత్యనారాయణకు వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఇప్పటికే అనేక మందికి వినికిడి యంత్రాలను అందజేశామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

పెద్దేరుకు నిధుల మంజూరుపై హర్షం



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజారాం

మాడుగుల రూరల్: ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పెద్దేరు జలాశయం, కుడికాలువ ఆధునీకరణకు రూ.84.40 కోట్లు మంజూరు చేయడం పట్ల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కింతలి గ్రామంలో రైతులు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తాలపురెడ్డి వెంకట రాజారామ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ధన్యవాదాలు తెలియచేస్తూ తీర్మానం చేశారు. మూడు మండలాలలో సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2006 సెప్టెంబరులో రూ.38 కోట్లతో పెద్దేరు జలాశయాన్ని నిర్మించి అప్పటి సీఎం, దివంగత మహానేత వైఎస్సార్ ప్రారంభించారన్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆయకట్టు రైతాంగం ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం బూడి విన్నపంపై, సీఎం జగన్ రూ.84.40 కోట్లు మంజూరు చేయడం పట్ల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కిమిడి రమణమ్మ, కింతలి, కె.వల్లపురం, కొంగలిపాక, అవురువాడ, దాలంపల్లి, కొండవోలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు, నీటి సంఘాల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

మాకవరపాలెం : బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని బూరుగుపాలెంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో గేదె శ్రీనివాసరావు(30)ని సోమవారం అరెస్టు చేసి, అతడి నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్టు వెల్లడించారు.

నేడు వడ్డాదిలో రాగిజావ పంపిణీ

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం కోసం అందిస్తున్న రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం అన్ని పాఠశాలల్లో ప్రారంభించనున్నట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్లో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలిత, గొంపా చినబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితర ముఖ్య నాయకులు చేతుల మీదగా రాగి జావ పంపిణీ చేపడతామన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు రూ.64.73 లక్షలు

మాకవరపాలెం : మండలంలో ఇప్పటివరకు రూ.64.73 లక్షల ఇంటి పన్నులు వసూలైనట్టు ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.99.54 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. నెలాఖరునాటికి వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

రైతులకు 60 శాతం రాయితీపై పశుదాణా



రైతులకు పశుపోషణలో ఆరోగ్య సూచనలు వివరిస్తున్న ఏడీ బైరాగి

కె.కోటపాడు : పాడి రైతులు వేసవి దృష్ట్యా పశుపోషణలో జాగ్రత్తలను పాటించడం ముఖ్యమని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి అన్నారు. సింగన్నదొరపాలెం గ్రామంలో సోమవారం పాడి రైతులకు పశు విజ్ఞానబడి కార్యక్రమంలో భాగంగా పశుపోషణలో పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సమీకృత పశుదాణా(టీఎంఆర్)ను 60 శాతం రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో పశుగ్రాస సమస్య లేకుండా ఉండేందుకు రైతులు పశువులకు మేతగా టీఎంఆర్ దాణాను ఇవ్వాలని కోరారు. అదే విధంగా రైతులు ఏడాదికి ఒక దూడ వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏడాదికి ఒక దూడ పుట్టడం వలన ఏడాదంతా పాల దిగుబడితో రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న గాలికుంటు టీకాలను పశువులన్నింటికీ వేయించాలని రైతులను ఏడీ బైరాగి సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ కేంద్రంలో బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకుంటున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి : గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి కోరారు. దేవరాపల్లి సచివాలయం–2లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. వేలిముద్రలు వేసి బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. స్థానిక సచివాలయం–2లో ఈ నెల 21, 27, 28, 29 తేదీలలో ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. గ్రామాల్లో ప్రజలకు వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కొత్త జిల్లా పేరుతో పాటు చిరునామా, ఫోన్ నెంబర్ అనుసంధానం తదితర వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. డిజిటల్ అసిస్టెంట్ రోజా మాట్లాడుతూ బాల ఆధార్ నూతన కార్డులను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. వీటికి సంభందిత డాక్యుమెంట్లతో పాటు పంచాయతీ సెక్రటరీ లేదా గెజిటెడ్ ఆఫీసర్‌తో ధ్రువీకరణ తప్పనిసరన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, వీఆర్‌వో జి.నూకరాజు, సచివాలయ సెక్రటరీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 25 ఫిర్యాదులు



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో

నర్సీపట్నం : స్పందనలో 25 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో ఆర్డీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం ఎస్సీ కాలనీలో దళితులకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని దళిత సంఘ నాయకులు అల్లంపల్లి ఈశ్వరరావు స్పందనలో ఫిర్యాదు చేశారు. రోలుగుంట మండలం, కుసర్లపూడి గ్రామానికి చెందిన మార్తిరాజు ఒంటరి మహిళ భూమిని అక్రమించి వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నారని, బాధితురాలికి న్యాయం చేయాలని జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ.రాజు, యాదగిరిదాసు ఆర్డీవో దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్లారు. గొలుగొండ మండలం, పాకలపాడు గ్రామానికి చెందిన రామలక్ష్మి తన భూమిని బంధువులు అక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆర్డీవోను ఆశ్రయించారు. స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

ఏరియా ఆస్పత్రిలో కాయకల్ప బృందం తనిఖీలు



అత్యవసర విభాగాన్ని పరిశీలిస్తున్న కాయకల్ప బృందం ప్రతినిధులు

నర్సీపట్నం : రాష్ట్ర కాయకల్ప బృందం సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని పరిశీలించింది. బృంద ప్రతినిధి ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులు) రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నర్సింగరావు, బృంద సభ్యులు ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సౌకర్యాలు, ప్రసూతి సేవలు, వైద్య సిబ్బంది పనితీరు, వార్డుల్లో శానిటేషన్, ఆస్పత్రి పరిసరాలను బృందం పరిశీలించింది. ఆయా విభాగాలకు సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి వైద్యులతో సమావేశమయ్యారు. జిల్లాలోని నర్సీపట్నం, అనకాపల్లి, నక్కపల్లి, కె.కోటపాడు, కోటవురట్ల ఆస్పత్రులను పరిశీలించినట్టు బృందం తెలిపింది. సమగ్రనివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు బృంద ప్రతినిధి డాక్టర్ నర్సింగరావు వెల్లడించారు.

ఈదురు గాలులతో వర్షం



విజయరామరాజుపేటలో కూలిన చెట్టును స్థానికుల సాయంతో తొలగిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలో భారీ ఈదురు గాలులతో సోమవారం వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద చెట్లు రోడ్డుపై పడటంతో చోడవరం, నర్సీపట్నం, విశాఖపట్నం, పాడేరు తదితర గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు నిలిచిపోయాయి. జెడ్పీటీసీ దొండా రాంబాబు స్థానికుల సహాయంతో రోడ్డుపై పడ్డ చెట్లును తొలగించారు. భారీ గాలులకు పలు గ్రామాల్లో జీడి, మామిడి కాయలు నేలరాలాయి. మండలంలో సుమారు 3,200 ఎకరాలలో వరి పొట్ట దశలో ఉంది. ఇటీవల ఎండలకు ఈ పంటలు వడలిపోయాయి. ఈ వర్షంతో వరిచేలు తెప్పరిల్లాయి.

మాడుగులలో వర్ష బీభత్సం

మాడుగుల: మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఘాట్‌రోడ్డు కూడలిలో కూరగాయల దుకాణాలు ముంపునకు గురయ్యాయి. వ్యాపారాల్లేక వర్తకులు దిగాలుపడ్డారు. ఈదురుగాలులు తోడవడంతో విద్యుత్ వైర్లు తెగి, సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 5 గంటలకు నిలిచిన విద్యుత్ సరఫరా రాత్రి 9 గంటలయినా పునరుద్ధరణ కాలేదు.

దేవరాపల్లి 2 సెం.మీ. వర్షపాతం

దేవరాపల్లి : మండల వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండలు ఉక్కిరిబిక్కిరి చేయగా మధ్యాహ్నం వాతావరణం చల్లబడింది. భారీ వర్షం కురిసింది. దేవరాపల్లిలోని వర్షపాతం నమోదు కేంద్రం వద్ద 2 సెం.మీ. రికార్డయింది. అకాల వర్షం జీడిమామిడి, చింతపండుకు తీవ్ర నష్టం చేకూరుస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డేవిడ్



అధ్యక్షుడు డేవిడ్

చోడవరం రూరల్ : చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ ఎన్నికయ్యారు. సోమవారం చోడవరం అసోసియేషన్ పాలకవర్గం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షునిగా డేవిడ్, ప్రధాన కార్యదర్శిగా గొర్లె కృష్ణవేణి గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా సరిపల్లి నర్సింగరావు, సహాయ కార్యదర్శిగా గుడిదేశి పెంట సత్యనారాయణ, కోశాధికారిగా ఆర్.ప్రసాదనాయు డు, కార్యవర్గ సభ్యులుగా మండల సింహాచలం నాయుడు, గ్రంథాలయ కార్యదర్శిగా బి.శివప్రసాద్, ఆటలు, సాంస్కృతిక కార్యదర్శిగా బి.రాజు, మహిళా ప్రతినిధిగా నళినిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భూ రీ సర్వే ప్రారంభం

మాడుగుల రూరల్: భూహక్కు రీ సర్వే సోమవారం అవురువాడ పంచాయతీ శివారు కాగిత గ్రామంలో ప్రారంభమైంది. ఈ సర్వే ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు జరుగుతుందని ఉప తహసీల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. ఈ సర్వేలో సర్పంచ్ కె.మోదహైందవి గుప్తేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు చెదల కృష్ణదొర పాల్గొన్నారు.